
సింగిల్ పేజీ కథ

# ఎమ్డాల బస్సు



– మడిపల్లి రాజ్‌కుమార్

ఎముడాలకు వోవాల్నని ఎన్ని పార్లనుకున్ననో అనుకునుడే ఐతున్నది. నేను అనుకునుడు షురూ జేసిన్నుంచి, మా యింటి చుట్టుముట్టోల్లు ఐదారుసార్లు పొయ్యొచ్చిరిగని నాకైతె ఎల్లుడె తీర్తలేదు. ఎవల్లతోనన్న తీరుల్లేదంటె నగుతరు. మీన్నించి "పుర్స తేడ్దిరా రాజిగా నీకు, సాలుకు రొండుపార్ల పదోది రాసుడ్కే సగం కావట్టివి కొడుక"- అని ఎక్కిరిస్తరు. ఇగ నాకంటె సిన్నోల్లు "రాజన్నా! నువ్వేడవోతవ్‌గని, గా ఎముడాలరాజన్ననే అత్తడ్‌తియ్, ఒకనాడు నిన్నుచూడ"- అనుకుంట కిసుక్కున నగుతుంటరు. గాల్లనుడు కాదుగని గట్లనే ఉన్నది నా కత. మా అవ్వ సెప్త దిగద నేను నాలుగైదోద్దుల పుట్టుగుడ్డును కిందమీద జేస్తుంటే, నీ పేరు పెడతం, నీ దగ్గరికి అత్తమని మొక్కిందట రాజన్నకు. ఇగ మల్ల ఇంటి అంచన దప్పక ఎముడాలల పుట్టెంటికలు దియ్యాల్నా, ఈడనే దీసి ముడుపుగట్టి పెట్టిండ్లు గప్పటినుంచి. ఏడోది పరీచ్చలు రాయవోయెముందు పెద్దిరికానికి మా అవ్వతో అవ్వా! నేను కామనుబోరడు పరీచ్చలు రాయవోతున్న అని జెప్తినా, అయ్యో! కొడుక గట్లన అయితె మంచిగ రాయ్ అని ఊర్కునెనా "ఎముడాల రాజన్నా! మావోడు ఏడోద్దిల గట్టెక్కెనా నీ తాటికి పంపిస్తనని మొక్కింది". దేవుడిని సూడాలెనని మనుషులకున్న తీర్గనే దేవునిగ్గూడ కాయిషుంటదేమో- గీడురావాల, కొబ్బరికాయ కొట్టాలె అని- ఏడోదిల పాస్‌జేసి ఎన్మిదిలకు నూకిండు. ఇగ పదోది ముంగట దీంట్ల ఎల్లదీస్తివా జరూర్‌గస్తడని మొక్కెనా మా అవ్వ. మనుషుల లెక్కనే అనుకుంట దేవుడుసుత, ఎన్నిసార్లని నమ్ముతడు. కోపానికచ్చిండేమో, "కొడుక, తెలుగులనే కాదుర దొంగ మొక్కు మొక్కితివి. "చల్‌గది పెయిల్" అని తెలుగును పోగొట్టెనా. "లెక్క తప్తావ్‌రా కొడ్కా" అని లెక్కలు తప్పుదీసె. ఇగ గప్పటినుంచి మూడుసార్లరాసి, కిందమీద పడి, ఎట్లనో లెక్కలొకటి తీస్తినా, ఇగ గిప్పటికి ఐదుసార్లాయెనా, తెలుగు ఎల్లుడే లేదు. మా అవ్వమాట మీద నమ్మిక చెడ్డదేమోనని దేవునికి ఈసారి నేనే మొక్కిన అట్టి గచ్చుడుగాదు నెత్తిగూడ కొరుక్కుంటనని. నా నెత్తి గుట్టతిరంగ పెరిగింది. మూతి కింద పోతుగొర్రెలెక్క నాలుగు గడ్డం పోసలు పెరిగినయ్ పొడూగ. అయినా కొరుగకుండ ఎమ్డాల రాజన్ననే నమ్మితిగని, గా దేవునికి నమ్మకం కాలె. మల్ల ముంచిండు. చల్ ఊల్లెనే కొరుక్కుంటా అనుడుగు వద్దు కొడుక, పొయ్‌రా! పొయ్యొస్తెనన్న, ఎల్తవేమోనని నన్ను ఎమ్డాలకు పొమ్మన్నది.

ఇగ పొద్దుగాల్లనే లేసి పోవాల్ననుకున్న. జబ్బ పంచిల జాంగ, బనీను, తుడ్చుకునే పంచె, తోముకోను యపపుల్లలు రొండూ సర్దితినా, మా అవ్వ! కొడుక! ముడుపు దేవుడికి అప్పజెప్పు. మర్వకు- అని, పుట్టెంటికలు గట్టిన ముల్లెఇచ్చి మల్లోసారి మరువకు అంటే అట్లనే అని సంచీల వెట్టిన. పరీచ్చ నాడేసుకున్న పునా పాంటు, బుష్షట్టు ఉతికి, ఇస్తిరి పెట్టె తిప్పి సందూకల వెట్టింది- తీసి ఏసుకున్న. గది శీనుగానిది. మా అవ్వతోని రొండునెల్లుగాల్లింట్ల బాసాండ్లు తోమిచ్చుకొని ఇచ్చింది సాకారమ్మ. శీను నా కన్న యాన్నర్దం చిన్నోడెగని, నాకు లూజవుతున్నది పైంటు. పొడూల సీలమండలదాకనే అస్తున్నది. ఇగ జారిపోకుండ బిర్రుగ మొలదారమెక్కిచ్చిన. ఒల్లకు దెలకుండ దొంగపొద్దున మోడుదాక నడుసుకుంట పోదామనుకొని ఎల్లిన్నా, గాతోవల ఎవల్లో పిలిసినట్లే అడ్డమొచ్చె పిల్లికండ్ల ఎంకన్న. ముంతలపాలు పిండుకోని అస్తున్నడు. గాని మాటలంటెనే జెర్లు వాకినట్లైతది నాకు. "షూటుబూటు మస్త తయారైనవ్ గిప్పుడేడిదిర పరీచ్చ, గింత పొద్దున ఎల్లినవ్" అని నగిండు. పరీచ్చకుకాదు ఎమ్డాలకు వోతున్న అన్న. ఏందిరా! ఎమ్డాలకు నువ్వా పరీచ్చ, ఎప్పుడెల్లెరా! నోరెల్లబెట్టిండు. ఎల్లలే. "పొయ్యస్తెగిన ఎల్తదని పోతున్న" అను కుంట నడువవోతె, ఆపి, "అరె ముందు శెప్పొద్దురా వోతనని, అయినా ఉషారవుతున్నవ్ బెటా! మునుపు దగ్గినా, తుమ్మినా ఎంకన్నా అని శెప్పెటోనివి. గీనడిమిల మందలిచ్చుడే మరిశినవ్. గదంత పోనిగని, రాంగ నాలుగు లడ్లు కొనుక్కరా, కాస్కర్ నాకే పసాదం. గిప్పుడిద్దామంటె పైసల్లేవు. మర్వకు"అని ఇడిసిపెట్టిండు. ఒల్లన కలగిట్ట గిక్కన్నే పొద్దెక్కుతదని జప్పజప్ప మోడుచేరిన గొడిశేపటికి సురార్న నుంచి వొచ్చిన నైటోని బస్సు వట్కోని నిమ్మల జేరిన. గాడ ఎముడాల బస్సు ఏడాగుతదో అల్లనీల్లనడిగి ఆడవొయ్ నిలవడిన. మా అవ్వముడుపు మరువకు కొడుక అని ముడిమీద ముడేసిచ్చిన ముల్లె, చైను లేక నోరు తెరుచుకోనున్న జబ్బసంచీల నించి జారిపోగిట్ట అని నడ్మినడ్మిల సూసుకుంట నిలుచున్న. నా కన్న బక్కగ నల్లగ ఉన్నడోడు నన్నే సూసుకుంట నిలుచున్నడు. నెరివడి నెరివడి కాల్లు కైలాసం, పానం పాతలం పోతదనంగ అచ్చింది బస్సు. ఎర్రబస్సే గని రంగీను రంగీనుల బోరడు, బస్సుమీద లింగం బొమ్మ, కాస్కరు గది ఏముడాలకే నడుస్తదేమో. నేను గాలింగం సూసి పబ్బతిపట్టి నిలిస్తినా, గాడునోల్లు ఒల్లమీద ఒల్లు పడుకుంట బస్సు ఎక్కవట్టిండ్లు. ఇగ శనామంది కిడ్కిలల్ల నుంచి దస్తులు, పంచెలు ఏస్తున్నరు. అందరిలెక్క నేను సుత బస్సు దర్వాజల నూకుకుంట, దొబ్బుకుంట ఎక్కవొయిన. పడిపోగిట్టా అని ఇక్మతుతోని ముల్లెకొసను ఒక చెయిల బిగ్గిత వట్కోని ఎక్కవట్టిన. లగూతోని లోపలికి సొర్రవోతుంటే ముల్లె ఇగ్గినట్టాయె. ఎవలుల్లా అని శెయ్యియిడ్సి సూసుడాల్నం. గా నల్లపొల్లడే ముల్లె అందుకొని ఉరుక జూస్తున్నాడు. ఒక్క అంగతో ఆని మీదపడ్డ. అంతా దొంగ దొంగ అని అరుస్తున్నరుగని ఒల్లు ఆన్ని పట్టుకోను ధైర్యం జేస్తలేరు, మాకెందుకని. ఆని చెయిలనుంచి నా ముల్లె నేను ఇగ్గుకొనుడుకు, ఆడు మందిలకురికి మాయమే అయిండు. గప్పుడచ్చిండు పీక పీకుకుంట పోలీసాయిన. ఒల్లు సెప్పిండ్లో పురాగయినకుంటనే లాటీతోని నా నడుం మీద యీడ్సి కొట్టిండు. "అరె పాపం గాయిన ముల్లెనే పోతుండె. కొట్ట కుండ్లి" అన్నరెవల్లో. అరె పుజూల్‌గ కొడ్తిగద అని, యీపు మీద శెయ్యితో రాసి, "ముల్లె లేమున్నయ్! ఏమన్న వొయ్‌నయ" అడిగిండు. "ఏమి లేవు" అనుకుంట బస్సెక్కవోతుంటె. ఆ "ముల్లెల పైసల్లేవ" అని అడిగిండు. 'లేవు' అన్న. మరేమున్నదిరా! గంజాయిగాని ఉన్నదా? కండ్లింత జేసిండు. గదెందుకుంటది అన్న నేను. నా చేతిల నుంచి ముల్లె తీస్కొని "మెత్తగున్నది, ఇప్తున్నబేబ గసుంటిదేమన్న ఎల్లాలె నీ తోడ్కలు దీసి జైల్ల వెడ్తా" అనుకుంట కిందా మీద వడి ముల్లన్ని ఇప్పదీసుడ్కే గాలికి ఎంటి కోటి లేసి ఆయన ముక్కులకు వోయిందేమో, తిట్టవోయినోడు, మోరపైకెత్తిండు తుమ్మదామని, "జడలుగట్టిన ఎంటికలకుచ్చు- దేవునిముడుపు" కింద వడగిట్ట అని ఆయన చేతుల నుంచి ముడుపు బట్ట తీసుకోని బస్సెక్కి మల్లా ముల్లె గట్టుకున్న.

ఇగ గా బస్‌ల కండకుటర్ మోర్ దోపోడుత్నడు. ఎటు వోవాలెనంటే ఎముడాల కంటినా..."ఏమ్డాల బీమ్డాలలు పోదండి...ఇది దిగిపోండి... దిగిపోండి..." అంటాండు. అరె! బోరడు సూసి ఎక్కినా! అన్నయినకుండా, చేతిల పొక్కలు పొడిసే దాంతోని మీది గొట్టంను కనేల్మని కొట్టి బస్సునాపి దిగుమంటడు. నడిమిల పెద్ద మనిషొకాయిన "మేం వేములవాడను ఎమ్డాలనే అంటాం. నువ్వు కొత్తగనా ఏంది రూట్ల. యాడినుంచి ఊడిపడినవ్" అని గట్టిగ జెప్పుడుకుగని లేకుంటే నన్ను దింపెటోడు. ఇగ గా బస్‌ల పాటల డెక్ కూడ ఉన్నది. ఊరు దాటంగనె పాటలేసిండు డ్రైవరు. కని ఎగురుడుదుంకుడు పాటలే అన్ని. నాకు గిదేంది దేవుని బస్‌ల గీపాటలేంది అనిపిచ్చుడు. ఆకరుకు ధైర్నంజేసి కండక్టరుతోని అంటి దేవుని పాటలు పెట్టిపియ్యుమని ఏ దేవుని పాటలు అనడిగిండు కండకుటరు. నేను యాజ్జీసుకోని "శివ శివ శంకర బత్కవ శంకర పాట అసుంటియి" అన్న. ఏంది మల్లా జెప్పుమన్నడు డ్రైవరు. మల్లా అంటే అందరు నగడే. కండకుటరు కూడ నగి పక్కకు నిల్సున్న నాతోని "వేములవాడ" అనుమంటడు నాకు 'ఎమ్డాల'నే నోటికస్తది. "భక్తవ" అనుమంటడు నాకు "బత్కవ' అనే అస్తది నోటికి. బల్లెసారు గావలసినపోడు బసుల సార్లై ఎంత సెప్పిన నా నోరు తిర్గదు. బస్సు ఎమ్డాల మలుపు తిరిగెగని నా నోరు మాత్రం తిర్గలే.